క్లుప్తంగా...

ప్రభుత్వ ఆస్పత్రిలో నేడు ఫొటోథెరపి వార్డు ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఫొటోథెరఫీ వార్డును ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య తెలిపారు. సోమవారం ఉదయం 10.30 ప్రారంభించనున్న ఫొటోథెరఫీ వార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మల్లారెడ్డి హాజరవుతారన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వరిపూరి కాలనీలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్‌క్యాంప్‌ను మున్సిపల్ చైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి, లయన్ ఇన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గూడురు సబితా ఆంజనేయులుగౌడ్, సురేష్, పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

మేడ్చల్: మున్సిపాలిటీలోని అత్వెల్లి మూడవ వార్డు, వివిధ కాలనీలకు చెందిన యువకులు బీజేపీ లో చేరారు. మున్సిపాలిటీ బీజేపీ నాయకులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజెందర్ నివాసానికి వెళ్ళగా ఆయన పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

పిల్లలకు దుప్పట్ల పంపిణీ



మేడ్చల్: పట్టణంలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో పిల్లలకు దాతలు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేష్, రాధిక, సురేఖ, పద్మ పాల్గొన్నారు.

17వ వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని 17వ వార్డులో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహ్మారెడ్డి, సందీప్‌గౌడ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా.. స్థానికుల ఆందోళన



ఉప్పరిపల్లిలోని ప్రభుత్వ భూమిలో వెలిసిన గుడిసెలు

శామీర్‌పేట్: శామీర్‌పేట మండల రెవెన్యూ పరిధిలోని ఉప్పరిపల్లిలోని ప్రభుత్వ భూమిలో శనివారం అర్ధరాత్రి స్థానికేతరులు గుడిసెలు వేసి కబ్జాచేశారు. దీంతో గ్రామస్తులు ఆదివారం ఉదయం అక్కడికి వెళ్ళి ఆందోళనకు దిగారు. పోలీసులు గ్రామస్తులను అక్కడి నుండి పంపించారు. శామీర్‌పేట మండల తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని, సోమవారం పోలీస్ బందోబస్తుతో కబ్జాలను తొలగిస్తామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సృజన్‌బాబు (ఫైల్)

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ అంబేద్కర్‌నగర్ సండే మార్కెట్ వద్ద సృజన్‌బాబు (41), భార్య రమాదేవిలు ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. సృజన్‌బాబు మద్యానికి బానిసై వచ్చిన సంపాదన అంతా ఖర్చు పెట్టేవాడు. ఈ నెల 2వ తేదీన పనికి వెళ్లున్నానని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూగ జీవులకు అందని వైద్యం

- ఆసుపత్రుల్లో వసతులు కరవు
- అరకొర మందులు..సిబ్బంది కొరత
- జిల్లాలో 2 ఏరియా, 16 పట్టణ, 29 గ్రామీణ పశువైద్య ఆసుపత్రులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వ పశువైద్యశాలల్లో ఒకవైపు మందుల కొరత, మరోవైపు అందుబాటులో సరిపడా లేని సిబ్బంది లేక పోవటంతో మూగజీవాల పెంపకం దారులకు ప్రైవేటు పశు దుకాణాలే దిక్కయ్యాయి. పాడి రైతులకు నిర్వహణ ఖర్చు పెరగడంతో నష్టాలపాలవుతున్నారు. పైగా వర్షాకాలం కావడంతో మూగజీవాలకు అనేక రోగాలు పొంచి ఉన్నాయి.

కనీస వసతులు లేక..

ఇరుకైన గదులు, శిథిలావస్థకు చేరిన వైద్య కేంద్రాలలో సరైన వసతులు లేక పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం తాగునీటి సదుపాయం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఉద్యోగులు, సిబ్బంది పడుతున్న అవస్థ అంతా ఇంతా కాదు. కూకట్పల్లి,గౌడవెల్లి ప్రాథమిక పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థలో ఉండటంతో..వేరే చోట నడిపిస్తున్నారు.

అందని మందులు..

పశు వైద్యశాలలకు ప్రతి మూడు నెలలకొకసారి మందులకు ప్రభుత్వం రూ.7 లక్షల చొప్పున ఇస్తోంది. ఏడాదిలో నాలుగు విడతలకు రూ.28 లక్షలు మందులకు అందజేస్తోంది.నిర్దేశించిన విధంగా పశువైద్యశాలలకు విడతల వారిగా మందులకు నిధులు విడుదల చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాడి రైతులు పశు వైద్యశాలలకు వెళ్లేందుకు వెనకడగు వేస్తున్నారు.

అడుగడునా నిర్లక్ష్యం..

నగరానికి సమీపంలో పశువైద్యశాలలు ఉన్నా.. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో పశువులకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదని తెలుస్తోంది. ఒక్కలిద్దరు సిబ్బందితోనే పశు వైద్యశాలలను ఒక్కలిద్దరు సిబ్బంది మాత్రమే నడిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.పర్యవేక్షణ కొరవడటంతో రోజుల తరబడి పలు పశువైద్యశాలలకు డాక్టర్లు, సిబ్బంది రాకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

43 లక్షల పశుసంపద..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పశుసంపద 43,00,886 కాగా, ఇందులో గోజాతి పశువులు 27,068, గేదెజాతి పశువులు 59,895, గొర్రెలు 1,49,401, మేకలు 40 వేలు,పందులు, 2,485, కోళ్లు, 39,72,037, కుక్కలు 50 వేలు ఉన్నాయి.

సిబ్బంది కొరత..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏర్పడి ఐదేళ్లు గడిచినా... జిల్లాస్థాయి పశు వైద్యశాల లేదు. ప్రస్తుతం ఉన్న పశువైద్యశాలలో సిబ్బంది కొరత వేధిస్తోంది. మేడ్చల్, ఉప్పల్ ఏరియా ఆసుపత్రులతో పాటు ఘట్కేసర్, పోచారం, డబుల్పూర్, పూడూరు, ఎంసీపల్లి, ఉద్దమర్రి, శామీర్పేట్, యాంజల్, దుండిగల్, అల్వాల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్పల్లి, మల్కాజిగిరిల్లోని ప్రాథమిక పశు వైద్యశాలల్లో డాక్టర్‌తో సహ ఇద్దరి సిబ్బంది చొప్పున.. ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల ఖాళీలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో ఇద్దరు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, అటెండర్ పోస్టులతో సహా 21 ఖాళీలు ఉన్నాయి. దీంతో పశువులకు అరకొర వైద్యసేవలు మాత్రమే అందుతున్నాయి.

జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రూ.1.35 కోట్ల వ్యయంతో ఎఫ్ఎస్‌టీపీ, ఏబీసీ సెంటర్ల ఏర్పాటుకు ఆదివారం మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో గతంలో మౌలిక వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మోడల్‌సిటీగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏకే.మురుగేష్, జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, మేక లలితయాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్..స్వేచ్ఛ సమానత్వానికి నిదర్శనం



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్: భారత దేశంలో స్వేచ్ఛ, సమానత్వానికి నిలువెత్తు నిదర్శనం అంబేడ్కర్ అని పోచారం మున్సిపాలిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల సమర్పణ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కుల, మత, లింగ బేధం లేకుండా భారత్ నిర్మాణానికి పాటుపడాలని అన్నారు. అరుణ్‌కుమార్, దాసు, నర్సింగ్ రావు, శ్రీనివాస్, రాజేశ్, నారాయణ పాల్గొన్నారు.

రెండు పడకల ఇళ్లను స్థానికులకే కేటాయించాలి



ఆందోళన చేస్తున్న వైస్ ఎంపీపీ జంగమ్మ తదితరులు

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను స్థానికులకు ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాల వారికి కేటాయించాలని వైస్ ఎంపీపీ జంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతాపసింగారంలో పట్టాలు పంపిణీ చేసిన రెండు పడకల ఇళ్లను ముందుగా స్థానికులకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన ఇళ్లను గ్రామానికి చెందిన వారికి కాకుండా అంబర్‌పేట్, ఎల్బీనగర్ నియోజకవర్గాల వారికి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. స్థానికులకు ఇళ్లను ఇవ్వని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

వడ్డెర కుల సంఘం కొండాపూర్ అధ్యక్షుడిగా శంకర్



నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్

ఘట్‌కేసర్: వడ్డెర కుల సంక్షేమ సంఘం కొండాపూర్, బాలాజీనగర్ అధ్యక్షుడిగా మక్కల శంకర్ ఎన్నికయ్యారు. వడ్డెర కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ అధ్యక్షతన పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడిగా తిమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్లుగా పి శంకర్, కుమార్, కోశాధికారిగా మహేశ్, ఉప కోశాధికారిగా మల్లికార్జున్, సలహాదారులుగా మహంకాళి, శ్రీరాములు, రంగయ్య, అంజయ్య, యాదగిరి, నర్సయ్య, ఎల్లప్ప, ప్రచార కార్యదర్శులుగా ఎస్ యాదగిరి, శ్రీశైలం, బాబు, మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ వారికి నియామక పత్రం అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, మురహారిపల్లిలో పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధి లోని గిర్మాపూర్‌కు చెందిన పలు పార్టీల నాయకులు, యువకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి నివాసంలో మంత్రి పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పారు.

తాగునీటి వృథాను పట్టించుకోరా?



తాగునీరు వృథాగా పారుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పోచారం: ఒకవైపు నీటి కొరతతో ప్రజలు అల్లాడుతుంటే, మరోవైపు తాగునీటిని వృథా చేస్తున్న వైనం పోచారం మున్సిపాలిటీలో కనిపిస్తుందని కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆరోపించారు. ఎల్ఐజీ కాలనీలో తాగునీరు లీకైన ప్రాంతాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజులుగా తాగునీరు లీకై రోడ్లపై పారుతున్నా మరమ్మతులు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



దాడిలో గాయాలైన కుమార్ తదితరులు

ఘట్‌కేసర్: కొండాపూర్‌లో తమ భూమిని కబ్జా యత్నం చేయడమే కాకుండా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొండాపూర్‌కు చెందిన మొలుగురం కుమార్ స్థానిక పీఎస్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అనంతరం పోలీసులు వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి పంపగా అక్కడికి వచ్చి గీస శ్రీను అతడి కుమారులు తిరిగి దాడి చేశారన్నారు. మా కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రపంచం మెచ్చిన ప్రధాని మోదీ

రామంతాపూర్: మేరా మాటి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామంతాపూర్ పరిధిలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం, పాండురంగ స్వామి దేవాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో బీజేపీ అత్యధిక మెజారిటీ స్థానాలు సాధిస్తుందన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు బండారు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నారాయణ దాసు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ముందు ఆందోళన..



పూడూరులో మరమ్మతులు చేపడుతున్న అధికారులు

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూరు గ్రామస్తులు గ్రామంలో విద్యుత్ సబ్ సమస్యను పరిష్కరించాలని గోసాయిగూడ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో విద్యుత్ ఓల్టేజీ సమస్య, సమాచారం లేకుండా సరఫరాను నిలిపివేత పై విద్యుత్ సిబ్బంది రవినాయక్, లైన్‌మెన్‌లకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామంలోని పలు బస్తీలలో విద్యుత్ సమస్య తీవ్రతరమైంది. నిత్యం విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది పడిన ప్రజలు సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేశారు. దీంతో అధికారులు సమస్యను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతిచెందిన జిబ్రాణి

శామీర్‌పేట్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన జిబ్రాణి (26), మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ కాలనీలో నివాసం ఉంటూ స్థానిక సిమెంట్ దుకాణంలో కూలీగా పని చేస్తున్నాడు. రోజూ లాగే పని ముగించుకొని లాల్‌గడి మలక్‌పేట నుండి జగ్గంగూడకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనదారుడు జిబ్రాణిని వెనకాల నుండి అతివేగంగా ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

డబుల్‌పై గుబుల్

- మేడ్చల్ రూరల్‌లో మొత్తం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 2,350
- పూర్తయినవి 683 మాత్రమే
- నిర్మాణ దశలోని ఇళ్లు 340... ప్రారంభ దశలో 1329 ఇళ్లు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: పేదల కలల సౌధం సొంతింటి కల రూరల్‌లో నెరవేరని పరిస్థితి నెలకొంది. మేడ్చల్ జిల్లా రూరల్ ప్రాంతంలో ఇళ్లు లేని నిరుపేదలకు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు పడకేశాయి. గృహలక్ష్మి పథకం ప్రవేశంతో డబుల్ ఇళ్ల నిర్మాణాలపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. .అలాగే, జిల్లాలోని అర్బన్ ప్రాంతమైన జీహెచ్ఎంసీ పరిధిలోని 4 అసెంబ్లీ నియోజకవర్గాలలో డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అవటంతోపాటు..పూర్తయిన ఇళ్లను కూడా టాంపర్ సాఫ్ట్ వేర్ పద్ధతి ద్వారా పంపిణీ చేశారు.(అర్బన్ ప్రజలకు సంబంధించి జీహెచ్ఎంసీ కొన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్మించి ,పంపిణీ చేసింది.)అర్బన్‌లో మొదటి దశ ఇళ్ల కేటాయింపులో భాగంగా ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 500 చొప్పున 2 వేల మందికి కేటాయించారు. అలాగే రెండో దశకు సంబంధించి ఇళ్ల కేటాయింపునకు కసరత్తు చేస్తున్నారు. అయితే రూరల్ ప్రాంతంలో మాత్రం దీనికి భిన్నంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు,కేటాయింపులు నత్తకు నడక నేర్పుతున్నాయి.

రూరల్‌లో ఇళ్ల మంజూరు 2,350 .. పూర్తయినవి 683 మాత్రమే

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రూరల్ ప్రాంతానికి ప్రభుత్వం 2,350 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 683 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా ఇందులో 300 ఇళ్ల వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే,మిగతా 340 ఇళ్ల నిర్మాణాలు తుది దశలో ఉండగా, మరో 1329 ఇళ్లు వివిధ నిర్మాణ దశలతోపాటు టెండర్ల ప్రక్రియలో కొనసాగుతున్నాయి.

రెండు శాఖల అధ్వర్యంలో...

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ(ఆర్అండ్‌బీ), పంచాయతీ రాజ్ శాఖ(పీఆర్)లు నిర్వహిస్తున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధ్వర్యంలో 23 ప్రాంతాల్లో రెండు దశల్లో 1176 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టగా, ఇప్పటి వరకు చెంగిచర్ల, కీసర, యాద్గార్‌పల్లి, పీర్జాదిగూడ, పర్వతాపూర్, తుర్కపల్లి, కిష్టాపూర్,సోమారం, చీర్యాల, బోడుప్పల్, ఘట్కేసర్, కొర్రెముల తదితర ప్రాంతాల్లో 501 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 10 ప్రాంతాల్లోని 675 ఇళ్లు వివిధ దశల నిర్మాణాలతో పాటు టెండర్ల ప్రక్రియ దశలో ఉన్నాయి.
- పంచాయతీ రాజ్ (పీఆర్) శాఖ అధ్వర్యంలో రాజబోల్లారం, తుర్కపల్లి, శామీర్‌పేట, అనంతారం, జగ్గంగూడ, కేశవాపూర్, కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి, నారాయణపూర్, చీర్యాల,యద్గార్‌పల్లి, నారపల్లి, ప్రతాపసింగారం, బోడుప్పల్, మేడిపల్లి,పర్వతాపూర్ ప్రాంతాల్లో 1174 డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా, ఇప్పటి వరకు 182 ఇళ్లు పూర్తయ్యాయి. 284 ఇళ్ల నిర్మాణాలు ప్రగతి దశలో ఉండగా, మిగిలిన ఇళ్లు ప్రారంభ దశలోనే ఉన్నాయి.

గృహలక్ష్మి పథకంతో... డబుల్‌పై అనుమానాలు

ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెటట్టంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కేటాయింపులపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత స్థలం ఉన్న వారందరికీ మహిళల పేరుతో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోంది.ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ప్రతీ నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను జిల్లా అధికార యంత్రాంగం స్వీకరించింది. ఇప్పటి వరకు జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 14,025 దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్ర స్థాయిలో వడబోసిన యంత్రాంగం లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు చేస్తోంది.

రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..!



మేడ్చల్: మేడ్చల్ -గిర్మాపూర్ రోడ్డులో గల మేడ్చల్ రైల్వే ట్రాక్ వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి పనులు అసంపూర్తిగా నత్తనడకగా నడుస్తుండటంతో పలు గ్రామాల ప్రజలు, పలు కాలనీల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ళ క్రితం పాలకులు ఏ మాత్రం ఆలోచన చేయకుండా పనులు ప్రారంభించారు. రైల్వే గేట్ అవతలి వైపు మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు, మండలంలోని గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు, కాలనీలకు మేడ్చల్ నుండి వెళ్ళె ప్రధాన మార్గం ఇదే. ప్రత్యామ్నయంగా రోడ్డు ఏర్పాటు చేయకుండా గేట్ ను తవ్వి బ్రిడ్జి పనులు మొదలు పెట్టారు.చిన్న అండర్ బ్రిడ్జి ఉండగా దానినే దారిగా చూపారు. అందులోనుండి కేవలం ద్విచక్రవాహనాలు, ఆటోలు మాత్రమె వెళ్లే వీలు ఉంది.కార్లు, ఇతర వాహనాలు గ్రామాలకు, కాలనీలకు వెళ్ళాలంటె గౌడవెళ్ళి నుండి రాయిలాపూర్ మీదుగా,లేదా డబీల్‌పూర్ మీదుగా రాయిలాపూర్ వరకు దాదాపు 10 కిలో మీటర్లు తిరిగి రావాలి. మేడ్చల్ నుండి రాయిలాపూర్ దూరం 5 కిలో మీటర్లు ఉండగా బ్రిడ్జి నిర్మాణం వల్ల 10కిలో మీటర్లు ఎక్కువగా తిరిగి రావాల్సి వస్తుంది.బ్రిడ్జి నిర్మాణ ప్రారంభం సమయంలో సంవత్సరంలో పూర్తి చేస్తామని చెప్పినా మూడెళ్ళు పూర్తియినా కేవలం 50శాతం పనులు కూడ పూర్తి చేయలేదు.

తాత్కాలిక ఏర్పాటు..వర్షం వస్తే చెరువె

బ్రిడ్జి అసంపూర్తిగా ఉండటంతో కింద నుండి రాకపోకలు సాగించడానికి మున్సిపాలిటీ తరుపున గత సంవత్సరం రామిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో జేసీబీలు ఏర్పాటు చేసి మట్టిని తవ్వించి దింవచక్రవాహనాలు, కార్లు, వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు.మున్సిపాలిటీ తరుపున వసతి కలిపించినా అది తాత్కాలికమే కావడంతో పెద్దగా ఉపయోగపడటం లేదు. వర్షం పడితే బ్రిడ్జి పూర్తిగా నీటీతో నిండిపోయి చెరువును తలపిస్తుంది.

అవస్థలు పడుతున్న ఆరు కాలనీల ప్రజలు.. 6 గ్రామాల ప్రజలు

మేడ్చల్‌కు రావాలంటే ఆరు కాలనీల ప్రజలు 6 గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న వరద నీరు వెళ్ళడానికి ఏర్పాటు చేసిన చిన్న అండర్ పాస్ బ్రిడ్జి నుండి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. రైల్వే ట్రాక్ అవతలి భాగంలో రెల్వే కాలనీ, సరస్వతినగర్, ఎల్లమ్మతోట, మెట్రో లైన్, సీసీఐ కాలని, వడ్డెర బస్తీలు ఉన్నాయి. గిర్మాపూర్, బర్మాజీగూడ, రాయిలాపూర్, బండమాదారం,శ్రీరంగవరం గ్రామాలు ఉన్నాయి. వీటన్నింటికి మేడ్చల్ కు రావడానికి ఒకటే దారి ఉండటంతో నిత్యం చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తుంది.

గుండ్లపోచంపల్లి బ్రిడ్జి అంతే...

కండ్లకోయ జాతీయ రహదారి నుండి గుండ్లపోచంపల్లి కి వెళ్ళె రూట్ లో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రెండెళ్ళు పూర్తయినా బ్రిడ్జి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.దీంతో మేడ్చల్ నుండి ఇతర ప్రాంతాల నుండి గుండ్లపోచంపల్లి కి వెళ్ళె వారు, మైసమ్మగూడ మల్లారెడ్డి కళాశాలలకు వెళ్ళె విద్యార్థులు అయోధ్య చౌరస్తా మీదుగా తిరిగి వెళ్ళాల్సి వస్తుంది. బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయాలని అధికార ప్రతిపక్షాల నాయకులు అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా, ధర్నాలు చేసినా ఫలితం మాత్రం శూన్యం.



ట్రాఫిక్ జాం తో రైల్వే బ్రిడ్జి వద్ద నిత్యం వాహనదారుల పరిస్థితి



వరద నీరు వెళ్లే అండర్ బ్రిడ్జి నుండి వెళుతున్న వాహనదారులు



వర్షం పడితే చెరువును తలపిస్తున్న బ్రిడ్జి